


ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర

వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 15 సంచిక : 10 జూన్ 2010





రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 16

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి
(ఫైమ)

చందా
సంవత్సర చందా:రూ॥150/-
విడి ప్రతి : రూ॥ 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
☎ 08814 - 224747
9247104551


ఈ సంచికలో....


అమలాపురం 21-04-2010

జిన్నూరు....... 11-05-2010



ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747


## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 21-04-2010, అమలాపురం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

శివుడి అవతారాలు చాలా ఉన్నాయి. అందులో ఆచార్యులవారిది లీలావతారం. శివుడు స్థిరం, ఆచార్యులవారు చరం. ఆచార్యులవారు జ్ఞానస్వరూపుడు, బోధస్వరూపుడు, అనుగ్రహస్వరూపుడు. ఆచార్యుడి అనుగ్రహం లేకుండా మనం అజ్ఞానంలోనుండి విడుదలపొందలేము. దురలవాట్లు, దుర్గుణాలు, దూరాలోచనలనుండి మనలను విడుదల చేసేవాడే ఆచార్యుడు. ఎవరి మాటవలన, ఎవరిచూపువలన, ఎవరి అనుగ్రహం వలన మనకు ఆత్మానుభవం కలుగుతుందో వాడే ఆచార్యుడు. ఆయన అనుగ్రహం ఉంటే మనం సాధించలేనిదంటూ ఏమీలేదు. మనం నేను, నేను అని అంటున్నాము కదా. ఆ నేను అనేది శరీరానికి పరిమితమైనది, మనస్సుకు పరిమితమైనది. మనలో ఉన్న అహంవృత్తే మనకు నేనుగా వ్యక్తమవుతోంది. అది నిజంకాదు, అది ఒక తలంపు. ఈ దేహము నేను అనే తలంపు ఉన్నంతకాలం ఇతర తలంపులు వస్తూనే ఉంటాయి. ఆ నేనును లోపలకు మళ్ళించి దాని మూలంలో ఉన్న ఈశ్వరుని పాదాల దగ్గరకు ఈ నేనును చేర్చగలిగితే ఈ మిధ్యానేను నశిస్తుంది. ఈ నేను అనే తలంపును పట్టుకొని దాని మూలంలోనికి పంపాలి లేకపోతే తనకన్న మహనీయమైన శక్తికి దానిని వశమైనా చేయాలి. ఆత్మసాక్షాత్కారానికి ఈ రెండే మార్గాలు.

మనకు ధనం ఉంటే, చదువు ఉంటే, ఆస్తులు ఉంటే సుఖంగా ఉంటాము అని అనుకొంటాము. మనం లోపల హృదయంలో అసహజంగా ఉంటే, మనంకాని విషయాలతోటి తాదాత్మ్యం పొంది ఉంటే మనకు బయట వేలాది ఎకరాలు ఉన్నా, కోట్లాది రూపాయలు ఉన్నా మనకు సుఖం లేదు, శాంతి లేదు, ఆనందం లేదు. మనకు బాహ్యంగా ఏమీ లేకపోయినా మన హృదయంలో సహజంగా ఉంటే మనం సుఖంగా ఉంటాము, శాంతిగా ఉంటాము, మరణాన్ని కూడా

జయిస్తాము. ఆత్మజ్ఞానం పొందటానికి రెండు మార్గాలు 1. ఆత్మవిచారణ, 2. ఆత్మసమర్పణ. ఆత్మవిచారణ జ్ఞానమార్గంలోనికి వస్తుంది, ఆత్మసమర్పణ భక్తిమార్గంలోనికి వస్తుంది. ఇక్కడ ఆత్మ అంటే మనస్సు. మీ పూర్వజన్మ సంస్కారాన్ని బట్టి మీ మనస్సుకు ఏ మార్గం నచ్చితే ఆ మార్గం ద్వారా ప్రయాణం చేయండి. ఆత్మవిచారణ ద్వారా మీరు మనోమూలాన్ని చేరుకోవచ్చు. ఈశ్వరపాదాలకు ఆత్మను అంటే మనస్సును సమర్పించి ఆత్మజ్ఞానాన్ని పొందవచ్చు. మీరు స్వతంత్రంగా చెయ్యాలంటే విచారణ చెయ్యండి. కాదో మనకంటే అతీతమైన శక్తి ఒకటి ఉంది, అది మనలను నడుపుతోంది, ఈ ప్రపంచాన్ని నడుపుతోంది అని దానికి శరణాగతి పొందండి. భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడా? ఉన్నాడు ఉన్నాడు అనుకొనేవాడు లేడేమో అని మీకు అనుమానం వస్తూ ఉంటే మీకు విచారణ మార్గమే మంచిది అని భగవాన్ చెప్పారు. కాని కొంతమంది విశ్వాసపాత్రులు ఉంటారు, వారికి సజీవమైన విశ్వాసం ఉంటుంది. వారికి శరణాగతి మార్గం మంచిది అన్నారు. మోక్షం పొందటానికి శరణాగతి మార్గమే సేఫ్‌సైడ్ అని రామానుజులు చెప్పారు. ఈ రెండు మార్గాలలో మీకు అనుకూలమైన మార్గం ఎంచుకొని ఆ మార్గంలో ప్రయాణం చెయ్యండి.

కామం అంటే కేవలం స్త్రీ పురుష సంబంధమే కామంకాదు. కామం అంటే కోరిక. ప్రపంచంలో గౌరవం కావాలి అని కోరుకోవటం కామం. నేను అట్టివాడిని, నేను ఇట్టివాడిని అని నువ్వు కానిదానితో తాదాత్మ్యం పొందుతున్నావు అంటే అది కామం. నువ్వు ఎవడివో నువ్వు తెలుసుకొనేవరకు నువ్వుకానిదానితో తాదాత్మ్యం పొందటం మానవు. ప్రేమించండి ప్రేమించండి మీ హృదయంలో ఉన్న అంతర్యామిని ప్రేమించండి. కాని మనం ఏమి చేస్తున్నాము అంటే ఆత్మను ప్రేమించటంలేదు, అనాత్మను ప్రేమిస్తున్నాము. ఏ వస్తువును అయితే తెలుసుకోవాలి అనుకొంటున్నామో దానిని ప్రేమించకుండా ఆ వస్తువును ఎలా తెలుసుకోగలము. ఆత్మను ప్రేమించండి అని అడిగితేమటుకు మీరు ప్రేమించగలరా దానికి వివేకం ఉండాలి అన్నారు ఆచార్యులవారు. ఆత్మజ్ఞానసముపార్జనకు వివేకం, వైరాగ్యం, శ్రద్ధ ముఖ్యం. ఏది మనకు ఉపయోగపడుతుంది, ఏది మనకు ఉపయోగపడదు, ఏది మనలను ప్రకృతిగుణాలనుండి విడుదల చేస్తుంది ఏది మనలను విడుదల చేయదు అని విభజించు కోవటానికి వివేకం ఉండాలి. ఆచార్యుడి అనుగ్రహం లేకుండా వివేకం పొందటం సాధ్యం కాదు. మనం లోపలకు వెళ్ళటానికి ప్రయత్నం చేస్తూ ఉంటే పూర్వజన్మల నుండి వచ్చిన సంస్కారములు, అలవాట్లు మనలను అడ్డంకొట్టి వెనుకకు గెంటేస్తాయి. ఆచార్యుడి దయ లేకుండా మనం లోపలకు ప్రయాణం చేయలేము. మా మనస్సు కుదురుగా ఉండటం లేదు. శరీరం ఒకచోట ఉన్నా మనస్సు అంతా తిరిగి వస్తోంది, దానిని అరికట్టలేకపోతున్నాము అని చాలామంది చెపుతున్నారు. జపం, ధ్యానం చేసుకొంటే కొంతవరకు మనస్సు స్వాధీనంలోనికి వస్తుంది. పూర్తిగా మనోచాపల్యం ఆగాలి అంటే వైరాగ్యం లేకుండా అది సాధ్యం కాదు. మనం ప్రతీదీ ఇతరులతో పోల్చుకొంటాము. మన పద్ధతిలో మనం జీవించాలి

కాని ఇతరులతో పోల్చుకొని జీవించకూడదు. అది బలహీనుడి లక్షణం, అది సోమరితనానికి గుర్తు. ఈ లోకానికి సంబంధించిన విద్యలు కావాలన్నా, శాశ్వతశాంతిని పొందాలన్నా ముందు జీవుడికి సోమరితనం ఉండకూడదు. సోమరితనం ఉన్నవాడు ఏమీ సాధించలేడు. సోమరితనం కొంత తగ్గించుకొంటే మనం బాగా సాధన చేయగలము. శ్రద్ధ లేనివాడు ఆత్మజ్ఞానం సాధించలేడు. వివేకము, వైరాగ్యం, శ్రద్ధ వీటిని జాగ్రత్తగా పోషించుకోవాలి. ఎవరితో సహవాసం చేస్తే ఇవి అభివృద్ధి అవుతాయో వారితో సహవాసం చెయ్యాలి. ఏ గ్రంధాలు చదవటం వలన మనకు లోచూపు కలుగుతుందో అటువంటి గ్రంధాలు మాత్రమే చదవాలి, మిగతా గ్రంధాలు ఏమీ చదవకూడదు.

జీవుడికి దేహబుద్ధి బలీయంగా ఉంటుంది. దేహబుద్ధి అంత బలీయంగా ఉండటానికి కామమే కారణం అని మనకు తెలియటం లేదు. మిగతా దుర్గుణాలు అన్నీ కామంలోనుండే వస్తున్నాయి. ఈ కామమే మనచేత చెడ్డపనులు చేయిస్తుంది. మనం నిజంగా చేతకాని వాళ్లం అయినా ఆ మాట ఇతరులు అంటే ఒప్పకోము. మనకు తెలివితేటలు లేకపోయినా మనం తెలివైన వారము అని అందరూ అనుకోవాలి. అంటే మనలను మనం వంచన చేసుకొంటున్నాము. ఇదంతా కామంలోనుండే వస్తోంది. ఇలా మనం భౌతికమైన విషయాలనే అంగీకరించలేనప్పడు, మన హృదయంలో ఉన్న నిజం అది నామరహితం, రూపరహితం ఇంక మనం దానిని ఎలా గుర్తించగలం, ఎలా అంగీకరించగలం. నీ దుఃఖానికి, జన్మలకు కామమే కారణం, నీకు ఏ కాంక్ష ఉన్నా సరే దానికి కామమే కారణం. శరీరం ఈ భూమి మీదకు వచ్చినప్పడు పుట్టాడు అంటారు, ఈ భూమిని విడిచిపెట్టి వెళ్లిపోయేటప్పడు చనిపోయాడు అంటారు. మీ పాతచొక్కాలు తీసేసి కొత్తచొక్కాలు ఇస్తున్నాను అని భగవంతుడు చెపుతున్నాడు. ఇక్కడ రహస్యం ఏమిటి అంటే ఈ భూమి మీద నుండి మనలను బయటకు పంపడు అనుకోండి కొత్త శరీరం ఇవ్వటానికి అవకాశం లేదు ఇదంతా మనకు మంచి చేయటానికే చేసే ఏర్పాటు అందుచేతనే మనలను బయటకు పంపేస్తాడు. కాని మనకు చావు అంటే భయం వేస్తుంది. జీవుడికి కోరికలు ఉంటాయి కదా. శరీరం లేకుండా వాడు కోరికలు ఎలా నెరవేర్చుకొంటాడు, నెరవేర్చుకోలేడు అందుచేతనే కొత్త శరీరాలు కల్పిస్తాడు. మరల శరీరం ఎక్కడ ధరించాలి అనేది మన చేతిలో లేదు, అది ఈశ్వర నిర్ణయం ప్రకారం జరుగుతుంది.

మీరు ప్రపంచాన్ని ఎంజాయ్ చేస్తున్నారు అనుకోండి. అలా ఎంజాయ్ చేసే కొలది ఎంజాయ్ చేసే బుద్ధి పెరిగిపోతుంది. మీకు ఏ కోరిక వస్తే ఆ కోరికను సంతృప్తి పరుస్తూ పోతే మీరు అజ్ఞానంలో కూరుకొనిపోతారు. ఇప్పడు మీకు సినిమా చూడాలని కోరిక వచ్చింది అనుకోండి. వెంటనే ఈ శరీరాన్ని సినిమాహాలుకు తీసుకొనిపోకుండా సినిమా చూడటం వలన మనస్సు పొల్యూట్ అయిపోతుందికదా, ఇంద్రియాలకు ఉద్రేకం కలుగుతుంది కదా అని జాగ్రత్తగా ఆలోచించి దానిని కొంచెం కంట్రోలు చేసుకొంటారు అనుకోండి మీకు శాంతి

కలుగుతుంది, సుఖం కలుగుతుంది. ఆత్మజ్ఞాన సముపార్జనకు కృషి చేసేవారికి ఈ లోకంలో శత్రువు అంటూ ఒకటి అంటే కామమే వారికి శత్రువు. ద్వైతం, అద్వైతం అనే పేచీలు మనకు వద్దు. చైతన్యం ఒకటిగానే ఉంది. మనకు అనుభవంలోనికి వచ్చినప్పుడు మాత్రమే అది మనకు తెలుస్తుంది. దానిని అనుభవంలోనికి తెచ్చుకోకుండా వివాదాలలోనికి వెళ్ళవద్దు. మాకు అది కావాలి, ఇది కావాలి అని కొంతమంది అడుగుతూ ఉంటారు. ఒకటి జ్ఞాపకం పెట్టుకోండి. మనకు అర్హత ఉంటే, యోగ్యత ఉంటే అది వస్తుంది కాని మనకు అర్హత లేకుండా, యోగ్యత లేకుండా కావాలని కోరుకొన్నా అది మనకు రాదు. నీ దేహప్రారబ్ధంలో ఉన్నదే జరుగుతుంది.

కామాన్ని ఎలా జయించాలి అని రమణమహర్షిగారిని అడిగితే బాహ్యఉపాయాలు ఆయన ఏమీ చెప్పలేదు. ఆత్మానుభవం కలిగేవరకు, ఆత్మజ్ఞానం పొందేవరకు నువ్వు కామంలో నుండి బయటకు రాలేవు అని చెప్పారు. ఈలోపుగా నువ్వు జయించేసాను అని అనుకొన్నా మరల పతనమవుతావు. ఈ కామం నీ ఇంద్రియాలలో, మనస్సులో, బుద్ధిలో మకాం వేసుకొని కూర్చొంది. పాములు పుట్టలో ఉంటాయి. నువ్వు పుట్టని ఎన్నిసార్లు కొట్టినా పాము ఎలా చస్తుంది పుట్టని కొడితే పాము చావదు, పాముని కొడితే పాము చస్తుంది. మనం పుట్టలను కొడుతున్నాము కాని పాములను కొట్టటం లేదు. ఇంక నువ్వు వాటిని జయించే అవకాశం లేదు. నీకు ఆత్మనుభవం అయ్యేవరకు ఈ రాగద్వేషములనుండి విడుదల పొందలేవు. అది కావాలి, ఇది కావాలి అని నువ్వు భగవంతుడిని అడగవద్దు, ఆయనతో వ్యాపారం చెయ్యకు. నీకు ఏది మంచిదో నీకంటే ఆయనకు బాగా తెలుసు. ఆయన ఇచ్చింది వద్దనకు, ఆయన ఇవ్వనిదానికోసం ఎదురుచూడకు. నాలుగుసార్లు ఏమీ అడగవద్దు, ఆయన ఏది అనుగ్రహిస్తే దానిని ప్రసాదంగా తీసుకో. ఇది శరణాగతి పొందినవాడి లక్షణం. అజ్ఞానంలో ఉన్నవాడు మనలను హర్ట్ చేస్తాడుగాని ఏ ఆచార్యుడు మనలను హర్ట్ చేయడు. ఆచార్యుడు మనకు కంఫర్ట్ ఇస్తాడు ఎందుచేతనంటే అక్కడ ఉన్నది జ్ఞానమే. ముందు మనం కృత్రిమ జీవితంలో నుండి బయటకు రావాలి. కొంతమందికి ఏమీలేకపోయినా అన్నీఉన్నట్లు నటిస్తారు. అది కృత్రిమజీవితం. ఆత్మజ్ఞానం వరకు వెళ్ళనక్కరలేదు ముందు నీ మనస్సులో వికారాలు లేకుండా నేచురల్‌గా, నార్మల్‌గా ఉండు. బయట నీకు ఏమీ లేకపోయినా రోజులు సుఖంగా వెళ్ళిపోతాయి. నీకు బాహ్యంగా ఏమీ లేకపోయినా హృదయంలో నువ్వు సహజంగా ఉంటే నీ మాటలకు అందని సుఖం, మనస్సుకు అందని సుఖం నీవు పొందుతావు. ప్రపంచంలో ఏదో ఉంది అని మనం అనుకొంటాము అందుకే మనస్సు బాహ్యముఖానికి పోతుంది. ఇలా బాహ్యముఖమైన మనస్సును అంతర్ముఖం చేయటానికి ఎన్నో జన్మలు సాధన చేసినా అది అంతర్ముఖం అవుతుంది అని చెప్పలేము. ఆచార్యుడి అనుగ్రహం ఉంటే కొన్ని క్షణాలలో ఆ పని పూర్తి అయిపోతుంది. నువ్వు ఎన్ని జన్మలు ఎత్తి సాధనలు చేసినా పొందలేనటువంటి శాంతిని ఆచార్యుడి అనుగ్రహం వలన కొన్ని క్షణాలలో పొందవచ్చు అంటే బాహ్యముఖమవుతున్న

నీ మనస్సుకు అంతర్దృష్టిని కలుగజేసి ఆత్మసుఖాన్ని నీ చేతికి అందిస్తాడు వాడే ఆచార్యుడు. అనేక జన్మలనుండి నువ్వు పోగుచేసుకొన్న దుఃఖాన్ని కొన్ని క్షణాలలో పటాపంచలు చేస్తాడు, వాడే ఆచార్యుడు. ఆచార్యుడి దయ లేకుండా ఏదీ నీకు సాధ్యంకాదు.

నీకు ఏదో శక్తి ఉందని అనుకొంటున్నావు కాని జీవుడికి శక్తిలేదు. శక్తి అంతా ఈశ్వరుడిదే. మనం తాలింపు పెట్టుకొనే కరివేపాకుకు ఉన్న విలువ కూడా అహంకారానికి లేదు. చేనులో పెంటవేస్తే రెండు బస్తాలు ఎక్కువ పండుతాయి. ఆ పెంటకు ఉన్న విలువ కూడా అహంకారానికి లేదు. అది ఎందుకు పనికిరానిది కాని మనం దానిని జాగ్రత్తగా పోషించుకొంటున్నాము. మన అహంకారాన్ని ఎవరైనా గాయంచేసారు అనుకోండి వారి మీద చాలా ఉద్రేకపడతాము ఎందుచేతనంటే అదే మనం అనుకొంటున్నాము. విద్యాదానం గొప్పది, అన్నదానం ఇంకా గొప్పది అని చాలామంది చెపుతూ ఉంటారు. ఈ అన్నిదానాలకంటే జ్ఞానదానం గొప్పది. జ్ఞానదానం ఆచార్యుడు ఒక్కడే చేయగలడు. ఆచార్యుడే మనకు జ్ఞానదాత, కాంతిదాత. ఆచార్యుడు ప్రసాదించే జ్ఞానం వలన మనం నిజమైన సుఖి అవుతాము. నీ హృదయంలో ఒక సత్యం ఉంది. అది నీకు డియరెస్ట్ రెలిటివ్. మీ లోపల ఉన్న ఆత్మ దేవుడు మీకు అందరి చుట్టాలకంటే దగ్గర చుట్టం. దేవతలు కూడా మనకు దూరపుచుట్టాలే. నీ దేహంకంటే, మనస్సుకంటే, ఇంద్రియాలకంటే వాడు అతి సమీపంలో ఉన్నాడు. అది నీకు తెలియకపోవటం వలన వాడు ఎక్కడో దూరంగా ఉన్నాడు అని నీకు అనిపిస్తుంది. సత్యం మన హృదయంలోనే ఉంది, ఉండటమేకాదు అది మనమై ఉన్నాము అన్న సంగతి సత్యానుభవం కలిగాక మనకు తెలుస్తుంది. అంతవరకు ఈ జనన మరణ ప్రవాహంలో కొట్టుకొనిపోతాము. రాత్రి మనకు కల వస్తుంది. అది మంచి కల అయినా, చెడ్డ కల అయినా అందులోనుండి మనం బయటకు వచ్చేస్తాము. అజ్ఞానం కూడా స్వప్నమే. చావులు పుట్టుకలు అన్నీ ఈ అజ్ఞానమనే కలలో జరిగిపోతున్నాయి. ఇది దీర్ఘస్వప్నం. ఈ అజ్ఞానమనే స్వప్నంలోనుండి నువ్వు బయటకు రావాలంటే ఆచార్యుడి దయ లేకుండా అందులోనుండి బయటకు రాలేవు. ఈ చావులు పుట్టుకలు నిజం అనుకొన్నాను, ఎంతో దుఃఖం అనుభవించాను కాని ఇది అంతా అసత్యం అని సత్యానుభవం కలిగాక అప్పుడు నీకు తెలుస్తుంది. అజ్ఞానంలోనుండి మనలను విడదీసి, మన జన్మలకు ఏది కారణమో ఆ కామాన్ని ఛేదించి ఎక్కడ కామం లేదో ఆ వస్తువులోనికి మనలను మేల్కొలిపేవాడే ఆచార్యుడు.

ఈ సృష్టి అంతా ఎవడిలోనుండి వచ్చిందో వాడికి ప్రాముఖ్యత ఇవ్వటం మానేసి ఈ ప్రపంచమే నిజం అనుకొని దానిని పట్టుకొని తిరుగుతున్నావు. నీ కళ్లకు కనిపించేదే నిజం అనుకొంటున్నావు. ఈ కల్పితమే నిజం అనుకొంటున్నావు. ముందు ప్రపంచంకాదు, ముందు భగవంతుడిని పట్టుకో. నీవు లోకవిచారణ చేయటంకాదు భగవంతుడి గురించి విచారణ చెయ్యి. మన ఇంట్లో ఉన్న మనుషులు సంసారంకాదు, మన మనస్సే సంసారం. మన శరీరం చనిపోయాక ఈ మనస్సు మనకూడా వచ్చేస్తుంది. మనస్సులో ఉన్న మంచి, చెడ్డా

మొత్తం లగేజి అంతా మోసుకొని మన కూడా వచ్చేస్తుంది. ఇప్పుడు మనకు ఉన్న అలవాట్లు అన్నీ ఈ జన్మలో కొత్తగా రాలేదు, ఎన్నోజన్మలనుండి అలా మోసుకొని వస్తున్నాము. ఎవడో ఆచార్యుడు వచ్చి దీనిని నరికేవరకూ అలా మోసుకొని తిరుగుతూ ఉంటాము. శరీరం కంటే ఇంద్రియములు గొప్పవి, ఇంద్రియములకంటే మనస్సు గొప్పది, మనస్సుకంటే బుద్ధి గొప్పది, బుద్ధికంటే ఆత్మగొప్పది అని భగవంతుడు చెప్పాడు. పండితులు బుద్ధి దగ్గరకు వచ్చి ఆగిపోతారు. శాస్త్రపాండిత్యాన్ని ఆత్మజ్ఞానం అనుకొంటారు. పాండిత్యం వేరు, ఆత్మజ్ఞానం వేరు. పాండిత్యం సంపాదించి నేను ఆత్మజ్ఞానిని అనుకొంటే వాడు పూర్తిగా పతనమైపోతాడు, శరీరం మరణించాక చీకటిలోకాలు మిగులుతాయి. హృదయంలో ఒక సత్యం ఉంది. దానిని మనం ప్రేమిస్తేనేకాని అది మనకు ఎరుకలోనికి రాదు. అనుకూలమైన భార్య దొరికినవాడికంటే, నచ్చిన ఉద్యోగం దొరికినవాడికంటే సత్యాన్వేషకుడు అదృష్టవంతుడు ఎందుచేతనంటే వాడు సత్యంవైపుకు ప్రయాణం చేస్తున్నాడు. భక్తులందరూ సత్యాన్వేషకులు కాదు. నీ హృదయంలో ఉన్న సత్యాన్ని నీ జీవితంలో ఎప్పడైనా ప్రేమిస్తే కదా. ఏ వస్తువు మీద అయితే నీకు ప్రేమ లేదో అది నీకు ఎలా లభ్యమవుతుంది.

అసలు మనస్సు అనేది లేదు. మీకు గాఢనిద్రలో మనస్సులేదు, జాగ్రదవస్థలో కనిపిస్తోంది. ఒక అవస్థలో ఉండి ఇంకో అవస్థలో లేనిది నిజం ఎలా అవుతుంది, అది నిజంకాదు. శరణాగతి కంటే మించిన ప్రార్థన లేదు. శరణాగతి పొందిన తరువాత నీకు ఇష్టాలు, అయిష్టాలు ఉండకూడదు. ఆయన ఇష్టమే నా ఇష్టం, ఆయన సంకల్పమే నా సంకల్పం అని శరణాగతి పొందినవాడికి ఇంక దుఃఖం రాదు. నీ శరణాగతి నిజమైతే నీకు బండెడు దుఃఖం ఉన్నా ఆ దుఃఖం అంతా సుఖంగా మారిపోతుంది. ఎప్పుడో మరణానంతరం కాదు, ఇప్పుడే శరీరం ఈ భూమిమీద తిరుగాడుతున్నప్పడే నీలో ఉన్న అశాంతి అంతా శాంతిగా మారిపోతుంది. మనం మహిమల జోలికి వెళ్ళకూడదు. అవి తాత్కాలిక మెరుపులు మాత్రమే. మహిమలలోనికి వెళితే మనస్సు బాహ్యముఖమైపోతుంది, చివరకు మోక్షమార్గానికి అవే అడ్డువస్తాయి. సత్యవస్తువు నీ హృదయంలో ఉంది, అది నీవై ఉన్నావు. కాని దాని తాలుక ఎరుక నీకు లేదు అందుచేత అశాంతి నిన్ను వెంటాడుతోంది. నువ్వు లోపలకు ప్రయాణం చెయ్యాలి. నీటిపైన ఈతలు కొట్టేవాడికి నీటిలో మునిగిపోయిన వస్తువు ఎలా దొరుకుతుంది వాడు లోపలకు మునగాలి. ఆ వస్తువు ఎంత లోతులో ఉందో అంత లోతులలోనికి వెళితేగాని ఆ వస్తువు దొరకదు. నీ హృదయంలో ఉన్న సద్వస్తువును పొందటంకోసం నువ్వు క్రమశిక్షణ నేర్చుకొని, ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం సంపాదించి, ఆగ్రహం తగ్గించి నిగ్రహం పెంచుకొంటూ హృదయం యొక్క లోయలలోనికి వెళితే ఆ వస్తువును పొందగలవు.

మనం ఇంటి దగ్గర అయినా అవసరం ఉన్నప్పడు మాట్లాడాలి, అవసరం లేనపుడు మాట్లాడకూడదు మీరు చేసే పని నిర్మలంగా చేసేయాలి, నిరాడంబరంగా చేసేయాలి. మీరు చేసిన మంచిపని ప్రక్కవాడికి తెలియాలి అనుకొంటారు అనుకోండి అదే కామం. నీకు

కామం ఉంది కాబట్టి ఇతరులకు తెలియాలి అనుకొంటున్నావు. అహంవృత్తిలో కామం ఉంది. అహంకారానికి ఇతరులు ఉన్నారుకాని చైతన్యానికి ఇతరులు లేరు. చైతన్యస్థాయి పొందినవాడికి ఇతరులు లేరు కాబట్టి ఇతరులు గుర్తించాలి అనివాడు అనుకోడు. వాడు చేసిన పని వాడికి కూడా తెలియదు. పునర్జన్మను తీసుకొని వచ్చే వాసనలు అన్నీ పూర్తిగా వేరుతోసహా నశించాలి అప్పుడు కాని మీరు పొందిన ఆత్మానుభవం నిలబడదు. మనకు పాండిత్యం ముఖ్యంకాదు, సాధకుడికి వాసనాక్షయం ముఖ్యం. ధనం, పాండిత్యం, గౌరవాలు, నీ శరీరం ఇవన్నీ బయట గొడవలు. ఈ బయటగొడవలు ఏమీ నిజం కాదు కాబట్టి ఏదోరోజున వీటినన్నింటిని విడిచిపెట్టి జీవుడు బయటకు రావాలి. మనం కాని విషయాలలో నుండి ఏదోరోజున ఈ జన్మలోనో, మరోజన్మలోనో సెపరేట్ అయ్యి తీరాలి. శరీరం చనిపోయిన తరువాత ఏమౌతుంది అని అక్కరలేదు. నువ్వు నిద్రలో శరీరంతో విడిపోతున్నావు, మనస్సుతో విడిపోతున్నావు, దేవుడితో విడిపోతున్నావు, పుణ్యపాపాలతో విడిపోతున్నావు కాని నిద్రలో నువ్వు ఉన్నావా లేదా, ఉన్నావు. ఆ ఉన్నవాడు ఇప్పుడు కూడా ఉన్నాడు. వాడిని పట్టుకో. వాడిని పట్టుకొంటే కాని ఆత్మానుభవం సాధ్యంకాదు. నిద్రలోనుండి జాగ్రదవస్థలోనికి రాగానే ఏది వచ్చాక అన్నీ వస్తున్నాయో, ఏది వచ్చిన తరువాత అన్నీ కల్పించబడుతున్నాయో ఆ మనస్సు ఎంత అబద్ధమో అది కల్పించిన విషయాలు కూడా అంతే అబద్ధం.

నువ్వు ఏది చెప్పినా ఇతరులు హర్ట్ అయ్యేలాగ చెప్పవద్దు. సత్యమును కూడా అప్రియముగా చెప్పకు ప్రియముగా చెప్పు. మాట కూడా తపస్సుతో సమానము అని పరమాత్మ చెప్పాడు. ఇతరులను గాయపరిచే మాటలవలన చివరకు మనకే అవమానాలు వస్తాయి. నేను అనే తలంపు ఉంటే అంతా ఉంది, నేను అనే తలంపు లేకపోతే ఏదీ లేదు. నేను అనే తలంపు నీకు బయట లేదు, అది నీలోపలే ఉంది. ఈ నేను అనే తలంపును ఉపసంహ రించండి, దాని మూలంలోనికి వెళ్ళి అది లయమయ్యేవరకు దానిని ఉపసంహరించండి, అప్పుడు నీకు చైతన్యమే తానుగా వ్యక్తమవుతుంది. నీకు కామం ఉంది కాబట్టి దేహం మీద నీకు ఇష్టం కలుగుతోంది. కామం లేకపోతే నీకు దేహం మీద అంత భ్రాంతి అక్కరలేదు. లోపల ఉన్న కామం దేహము నేను అనే భ్రాంతిని పెంచుతుంది. మీకు నచ్చినా నచ్చకపోయినా, మీకు ఇష్టం అయినా, ఇష్టం లేకపోయినా హృదయంలో ఉన్న వస్తువు గురించి చెప్పారు రమణభగవాన్. రమణుడు అంటే అనుగ్రహం. రమణుడు శరీరం ఇప్పుడు ఇక్కడ లేదు. రమణుడు శరీరం ఇక్కడ లేదు కాబట్టి అనుగ్రహం లేదు అనుకోవద్దు. శరీరానికి చావు ఉంది కాని అనుగ్రహానికి చావులేదు. అసలు కనిపించే మనుషుల మీదే మనకు ప్రేమ లేదు ఎక్కడో కనిపించని సత్యవుస్తువు మీద మనకు ప్రేమ ఎలా కలుగుతుంది. సత్యవస్తువు మీద ప్రేమ అంత తేలికగా కలుగదు. బుద్ధి సూక్ష్మత లేకుండా, వివేకం లేకుండా ప్రేమ కలుగనే కలుగదు. నేను శరణాగతి పొందిన తరువాత ఎలా ఉంటుంది అని అడుగుతున్నారు. ఇప్పుడు మైసూర్‌పాక్ నీ చేతిలో ఉంది. ఏమండీ దీనిరుచి ఎలా ఉంటుంది, దీని రుచి ఎలా

ఉంటుంది అని అడిగి నా ప్రాణం తీసేబదులు నీ నోట్లో వేసుకొని చూస్తే దాని రుచి నీకే తెలుస్తుంది కదా. శరణాగతి ఎలా ఉంటుందో అది పూర్తి అయిన తరువాత దాని తాలుక అనుభవం నీకే తెలుస్తుంది కదా అంటున్నారు. మన శరీరాన్ని, ఇంద్రియాలను, మనస్సును తీసుకొని వెళ్లి లోపల ఉన్న సత్యవస్తువుకు స్వాధీనం చేయటమే శరణాగతి.

మీరు ఎన్ని జన్మలు ఎత్తినా, ఎన్ని కష్టాలు నష్టాలు అనుభవించినా ఇవన్నీ స్వప్న మాత్రమే. ఈ సంఘటనలు అన్నీ జరుగుతున్నప్పుడు కూడా నువ్వు నువ్వుగానే ఉన్నావు. నీ హృదయంలో ఉన్న సత్యం అది ఎప్పుడూ అలాగే ఉంది. ఈ చావులు, పుట్టుకలతో దానికి సంబంధం లేదు, వీటి అన్నింటికి అతీతంగా అది ఉంది. నువ్వు కష్టాలు అనుభవిస్తున్నప్పుడు కూడా నువ్వు అదిగానే ఉన్నావు. అది ఎప్పుడైతే నీకు అనుభవంలోనికి వచ్చిందో ఈ కష్టాలు కూడా స్వప్న మాత్రమే అన్న సంగతి నీకు తెలుస్తుంది. ఉన్నది ఉన్నట్లుగా నీకు అనుభవంలోనికి వచ్చినప్పుడు లేనిది లేనట్లుగా నీకు తెలుస్తుంది. ఉన్నదేదో ఉంది. అదే సుఖం, అదే శాంతి, అదే ఆనందం. అక్కడికి మనలను మేల్కొలపటానికే ఆచార్యుడు గురిపెడతాడు. ఆచార్యుడి నాలుక నోట్లో ఉండదు. ఏ హృదయంలో అయితే జ్ఞానం ఉందో అక్కడ వాడి నాలుక ఉంటుంది. అక్కడ నుండి వాడు మాట్లాడతాడు కాబట్టి జ్ఞానాన్ని మన మీద వర్షింపచేస్తాడు, వాడు ఆచార్యుడు. ఆచార్యులవారు పొందిన జ్ఞానం ఎవరికో కొంతమందికే పరిమితం కాదు. మీరు అందరూ అందులో వాటాదారులే.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 18-05-2010, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈరోజు శంకర జయంతి. శంకరుడే శంకరాచార్యులుగా ఈ భూమిమీద అవతరించిన రోజు. ఆచార్యులవారు 788వ సంవత్సరంలో కేరళలో ఉన్న కాలిడిలో శరీరం ధరించారు. 820వ సంవత్సరంలో కేదార్‌లో ఆయన శరీరం విడిచిపెట్టారు. ఆయన ఈ భూమిమీద 32 సంవత్సరాలు ఉన్నారు. ఆచార్యులవారు ఏ గ్రంథం వ్రాసినా నారాయణ స్మరణతో ప్రారంభించేవారు. అందుచేత ఇప్పటికి కూడా మనం ఎవరికైనా స్వాములకు నమస్కారంపెడితే నారాయణ నారాయణ అంటారు. అంటే మీరు పెట్టే నమస్కారం నారాయణుడికి అందజేస్తున్నారు. ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు, భగవద్గీత ఈ మూడు మన సనాతన ధర్మానికి మూలగ్రంధాలు. మన నోటికి వచ్చినట్లు మాట్లాడితే కుదరదు. మనం చెప్పిన వాక్యానికి ప్రమాణం ఉపనిషత్తులలో ఉండాలి, బ్రహ్మసూత్రాలలో ఉండాలి లేకపోతే భగవద్గీతలో అయినా ఎక్కడోచోట ప్రమాణం చూపించాలి. వీటినే ప్రస్థానత్రయం అని అంటారు. ఈ మూడు ఉన్నాయి కాని వీటికి ప్రచారం లేదు. అందులో ఏముందో ప్రజానీకానికి తెలియటంలేదు. వాటిలో బంగారం ఉంది కాని ఆ బంగారాన్ని ఎలా ఉపయోగించుకోవాలో మానజాతికి తెలియటంలేదు. అప్పుడు ఆచార్యులవారు ఈ మూడింటికి భాష్యాలువ్రాసి, దేశం అంతా తిరిగి

ప్రచారం చేసారు. మన మూల గ్రంధాలలో ఇంత విశేషం ఉంది, అది మనకు తెలియటంలేదు అని అప్పడు ప్రజలకు కొంత అర్ధమయ్యింది.

ఆచార్యులవారి తండ్రిపేరు శివగురువు, తల్లిపేరు ఆర్యాంబ. ఆయనకు 8వ సంవత్సరం వచ్చేటప్పటికి అన్ని శాస్త్రాలు వచ్చేసినాయి. అయినా సాంప్రదాయాన్ని పోషించటంకోసం గురుకులంలో పాఠాలు నేర్చుకొన్నారు. ఆచార్యులవారు గోవిందభగవద్పాదులదగ్గరికి వెళ్ళారు. గురుపరంపర ఏమిటి అంటే మొట్టమొదట ఉపనిషత్తులలో ఉన్న అద్వైతసారాన్ని తీసుకొని వచ్చినవాడు గౌడపాదుడు. గౌడపాదుడి యొక్క శిష్యుడు గోవిందభగవత్పాదుడు. గోవింద భగవత్పాదుడి దగ్గర ఉపనిషత్తుల సారాన్ని ఆచార్యులవారు నేర్చుకొన్నారు. నువ్వు కాశీవెళ్ళి అక్కడ పండితులతో మాట్లాడు అని గురువుగారు ఆచార్యులవారిని ఆజ్ఞాపించారు. గురువు సలహా మీద ఆచార్యులవారు కాశీపట్నం వచ్చారు. అప్పడు భారతదేశంలో మతానికి సంబంధించి ఒక క్రమం లేదు. హిందూమతం అనేక శాఖల కింద విడిపోయింది. ఆ శాఖల పండితులు వారికి తోచింది చెప్పటం, దానికి ప్రమాణం లేదు. అప్పడు ఆచార్యులవారు పండితులనందరిని కూర్చోబెట్టి మీరు చెప్పేదానికి ప్రమాణం చూపించండి లేకపోతే నేను చెప్పేదానికి ప్రమాణం చూపిస్తాను ప్రమాణం లేకుండా మీకు తోచిందే నిజం అనుకొంటే ఎలా కుదురుతుంది అని వారితో వాదించి వారిని ఓడించాడు. మొట్టమొదటగా భారతదేశాన్ని ఆధ్యాత్మికంగా సమైక్యతలోనికి తీసుకొని వచ్చినవాడు ఆచార్యులవారు. మూలసూత్రాలను ఆధారంగా తీసుకొని మన ధర్మానికి ఒక రూపం ఇచ్చినవాడు ఆచార్యులవారు.

బోధ అంటే ఒక్క ఆత్మజ్ఞానానికి సంబంధించిన బోధే బోధ, మిగతాది అంతా బాధ. మీరు కాలేజీలలో, స్కూలులో చదువుకొన్న విద్యలవలన పొట్ట వెళ్ళిపోతుంది. ఏదో రోజుకయినా దానిని మరిచిపోవాలి, మనం ఇంద్రియాలతో, బుద్ధితో గ్రహించిన విద్య వలన నీకు సుఖంలేదు, శాంతిలేదు, ఆనందం లేదు. అయితే దాని వలన ఉపయోగం లేదా అంటే ఉపయోగం ఉంది, దాని వలన నీ శరీరయాత్ర నడిచిపోతుంది, అందులో పారమార్థికం ఏమీలేదు. జ్ఞానం అంటే ఆత్మజ్ఞానం ఒక్కటే. ఆత్మజ్ఞానాన్ని బోధించటమే బోధ. దానిని దక్షిణామూర్తి మౌనంగా బోధించాడు. ఆచార్యులవారు ఎంతసేపు శ్రవణం, మననం అన్నారు. ఏది తెలుసుకొన్నాక నీకు తెలుసుకోవటానికి ఏమీ మిగలదో ఆ వస్తువు నీ హృదయంలోనే ఉంది. ఏమోనండీ మాకు తెలియదండి అంటే తెలియదు అంటున్నావు కదా ముందు దాని గురించి విను. వినకుండా నీకు ఏమి తెలుస్తుంది. ముందు సబ్జక్టు బాగా శ్రవణం చెయ్యాలి. ఏదో మహిమలు చేసేవారు, గారిడీ చేసేవారు నీకు గురువులా? ఏదైతే చెపుతున్నాడో దానికి సంబంధించిన అనుభవం ఎంతోకొంత ఉండాలి కదా అంటున్నారు.

ఇప్పడు మనకు జగత్తు జగత్తుగా కనిపిస్తోంది, జీవుడు జీవుడిగా కనిపిస్తున్నాడు, దేవుడు దేవుడిగా కనిపిస్తున్నాడు. కాని ఈ ముగ్గురు ఒక్కటే అంటున్నారు ఆచార్యులవారు. ఇదేం గొడవ అని అడిగితే నీకు అమృతానుభవం కలిగేవరకూ నువ్వు ఏదైతే శ్రవణం చేస్తున్నావో

దానిని మననం చెయ్యి. అలా మననం చేయగా, చేయగా నీకు ఏవైతే మూడుగా కనిపిస్తున్నాయో ఈ మూడూ నీలో ఐక్యమైపోతాయి. నీకు ఏవైతే మూడుగా కనిపిస్తున్నాయో అవి బ్రహ్మంలో కల్పించబడ్డాయి అంటే ఒకే పదార్థంలోనుండి ఇవి వచ్చాయి. మననం చేయటం వలన నువ్వు జ్ఞానం ముద్ద అయిపోతావు. అప్పుడు నీకంటే భిన్నంగా లోకం లేదు. నీకంటే భిన్నంగా జీవుడు లేడు, నీకంటే భిన్నంగా దేవుడు లేడు. ఆచార్యులవారు నాలుగు మఠాలు స్థాపించారు. శృంగేరీలో స్థాపించిన మఠం ద్వారా బాగా పని జరుగుతోంది, అద్వైత ప్రచారం జరుగుతోంది. అద్వైతం అంటే ఏమిటి అంటే రెండు లేవు, ఉన్నది ఒక్కటి అంటే ఒక్కటే అని చెప్పటం. నీకు రెండు ఉంటే రెండులో నుండి కామం వస్తుంది, రెండులో నుండి ద్వేషం వస్తుంది, రెండులో నుండి కోపం వస్తుంది. ఉన్నది ఒక్కటే అయితే ఏమి వస్తుంది, ఆ స్థితిని పొందమని చెప్పటం, అదే అమృతానుభవం. జీవన్ముక్తస్థితి గురించి ఆచార్యులవారు ఏమి చెప్పారు అంటే మోక్షం పొందటానికి నువ్వు శరీరం చనిపోయేవరకూ ఆగనక్కరలేదు, ఈ శరీరం ఉండగానే పొందవచ్చు. కామక్రోధాలలో నుండి, నీలో ఉన్న కల్మషంలో నుండి, బేధబుద్ధిలో నుండి ఈ శరీరం ఉండగానే విడుదల పొందితే ఇప్పడే ఇక్కడే నిన్ను మోక్షం వరిస్తుంది, అదే జీవన్ముక్తస్థితి అని చెప్పారు.

మనం బండతనానికి, సోమరితనానికి అలవాటుపడిపోయాము. మనకు వివేకం లేదు, బుద్ధి సూక్ష్మత లేదు. బయటకు వెళితే రోజూ మూఢనమ్మకాలు, మూఢఆచారాలు, ఎవరు ఏది చెపితే అది నిజం అనుకొంటాము, దారిని పోయేవాడు ఏదైనా చెపితే అదే నిజం అని భుజాన్ని వేసుకొని తిరుగుతూ అసలు దీనికి ఏమైనా ప్రమాణం ఉందా, ఇది మనలను ఒడ్డుకు తీసుకొని వెళుతుందా అనే విచారణ లేదు. పని అంటే బాగా బద్ధకం అలవాటు అయిపోయింది. శ్రవణం చేయమంటే ఎవరూ శ్రవణం చేయటంలేదు. ఆచార్యులవారు రోజుకు 7, 8 గంటలు శ్రవణం చేయించేవారు. ఆచార్యులవారి టీచింగ్‌లో మీరు ఇంటికి వెళ్ళి సాధన చేయవలసింది పదివంతులే. మిగతా 90 వంతులు ఆయన టీచింగ్‌లో మీకు వచ్చేస్తుంది. ఆచార్యుడు అంటే కేవలం బోధస్వరూపుడేకాదు ఆయన అనుగ్రహస్వరూపుడు. ఆయన అనుగ్రహానికి పాత్రులవ్వటం కోసం ఈ రోజున మనం శంకరజయంతి చేసుకొంటున్నాము. మనం బయటకు చూడటం నేర్చుకొన్నాము కాని లోచూపు మనకు అలవాటు లేదు. మనుషులు, చెట్లు, జంతువులు అని ఇలా మనం విడదీసుకొంటున్నాము కాని ఉన్నది అంతా చైతన్యమే. మీకు లోచూపు అలవాటు అయితే ఈ మనుషులు, జంతువులు, చెట్లు అన్నీ చైతన్యములో నుండి కల్పించబడినవే అనే అనుభవం మీకు కలుగుతుంది. ఇది కంగారుపడితే రాదు. మీరు లోచూపును అభ్యాసం చేయాలి. మీరు లోపల తియ్యగా ఉండాలి, పవిత్రంగా ఉండాలి, వివేకవంతంగా ఉండాలి. అలా ఉంటే ఈశ్వరుడు మిమ్మల్ని అనుగ్రహిస్తాడు. లోపల వస్తువు ఉంది కాని అది మీకు గోచరం కావటం లేదు అంటే దానికి మీలో ఉన్న దోషాలు కారణం. ఇతరులలో ఉన్న దోషాలు చూడటం వలన మీకు ఏమి కలిసివస్తుంది. మీలో ఏ దోషాలు

ఉన్నాయో చూసుకొని వాటిలో నుండి విడుదల పొందటానికి ప్రయత్నం చేయండి.

ద్వైతబుద్ధిని పోగొట్టుకో. శరీరాలు తేడా, గుణాలు తేడా, మనస్సులు తేడా కాని లోపల ఉన్న వస్తువు ఒక్కటే. ఆచార్యులవారు ఏమన్నారు అంటే నీకు చేతనైతే రోజుకు ఒక చిన్నమంచి పని అయినా చెయ్యి. నీకు సజ్జన సహవాసం దొరికితే, ఒకవేళ పదినిమిషాలు దొరికినా ఆ అవకాశం విడిచిపెట్టకు. నీ ప్రారబ్ధాన్ని బట్టి జీవితంలో మంచి ఎదురవుతుంది, చెడు ఎదురవుతుంది, ఏది వచ్చినా శాంతిని పోగొట్టుకోవద్దు. నీకు ఏదైనా చెడ్డ కర్మ ఎదురైతే దానికి వారు కారణం, వీరు కారణం అని జనాన్ని తిట్టవద్దు. నువ్వు పూర్వకాలంలో చేసిన కర్మే నీకు ఎదురవుతోంది అనుకో. ప్రపంచంలో ఉన్న జనాన్ని పట్టుకొని తిట్టటం వలన హింసా ప్రవృత్తి పెరిగిపోతుంది. అందుచేత నువ్వు శాంతిని పోగొట్టుకోవద్దు. శాంతిని పోగొట్టుకొంటే నష్టం ఏమిటి అంటే ఈ మంచీ, చెడ్డ కాల ప్రవాహంలో కొట్టుకొనిపోతాయి కాని నీవు శాంతిని పోగొట్టుకొంటే నీ ఇంద్రియాలకు చపలత్వం వచ్చేస్తుంది, నీ మనస్సుకు చపలత్వం వచ్చేస్తుంది, చివరకు నువ్వు పతనమవుతావు. నువ్వు శాంతిగా ఉంటే నెమ్మదిగా ఇంద్రియాలు, మనస్సు స్వాధీనంలోనికి వచ్చేస్తాయి. శరీరం వచ్చాక ఏదో ఒకటి వస్తుంది, ఏదీ రాకుండా ఎలా ఉంటుంది. సర్వకాల సర్వావస్థలలో శాంతిని కాపాడుకో. ఈశ్వరుడిపాదాలను విడిచిపెట్టవద్దు. ఈశ్వరుని పాదాలయందు భక్తికలిగి ఉండు. నువ్వు అలాగ ఉండకు, ఇలాగ ఉండకు. నువ్వు ఏది అయి ఉన్నావో దానిలా ఉండటం నేర్చుకో. అది భక్తి నీకు నేర్పుతుంది. ఆచార్యుడిని గౌరవించు. నీ మనస్సులో గురువుపట్ల గౌరవం కలిగి ఉండు. ఎందుచేతనంటే గురువుపట్ల గౌరవం లేకపోతే ఆ గురువు చెప్పే బోధ నీ హృదయంలో ప్రవేశించదు.

నీకు అవినయం ఉంటే పోగొట్టుకోవటానికి ప్రయత్నం చెయ్యి. అశ్రద్ధ ఉంది అనుకో దానిని పోగొట్టుకోవటానికి ప్రయత్నం చెయ్యి. మోక్ష సామాగ్రిని సంపాదించుకో. నీకు ఉన్న అజ్ఞానాన్ని పోగొట్టుకోవటం ఒక పనికాకపోతే ఏమిటిరా నువ్వు చేసేపని ఈ లోకంలో అంటున్నారు ఆచార్యులవారు. మేము జీవితంలో చాలా బిజీగా ఉన్నాము, సాధనకు మాకు టైము లేదు అంటే నువ్వు ఎక్కడ బిజీగా ఉన్నావు, కామ్యకర్మలతో బిజీగా ఉన్నావు. ఈ భూమి మీదకు వచ్చినపని అదేనా? నీ జీవితంలో ఒక్క మనిషికి అయినా ఎప్పుడైనా ఉపయోగపడ్డావా? నీ అహంకారాన్ని సంతృప్తి పరచుకోవటానికి ప్రయత్నం చేస్తూ బిజీగా ఉన్నాను అంటావు ఏమిటి? నువ్వు కామ్యకర్మలు తగ్గించుకో అంటున్నారు ఆచార్యులవారు. నీ శరీరయాత్ర నడుపుకోవటానికి తగిన పని చేసుకొని మిగతా టైము భగవంతుడిని తెలుసుకోవటానికి ప్రయత్నం చెయ్యి. మనలో అజ్ఞానం ఉన్నట్లు మనకు తెలుస్తోంది. మనకు కోరికలు, అసూయ, ద్వేషం ఉన్నట్లు మనకు తెలుస్తోంది. ఇదంతా కల్మషమే కదా. ఈ కల్మషం పోగొట్టుకోవటం మానేసి నేను బిజీగా ఉన్నాను అంటావు ఏమిటి? నీలో ఉన్న అవిద్యను, కల్మషాన్ని పోగొట్టుకోవటం నీకు ముఖ్యమైన పనికాకపోతే ఈ లోకంలో ఏది నీకు ముఖ్యమైన పని అని అడుగుతున్నారు. నీలో ఉన్న అవిద్యను పోగొట్టుకోవటం మానేసి

కామ్యకర్మలు చేస్తూ జన్మలు పెంచుకొంటావా? ధర్మ, అర్ధ, కామ, మోక్షముల గురించి మనం చదువుతున్నాము. ఈ నాలుగు ముఖ్యం అని చెపుతారు. ఆచార్యులవారు ఏమంటున్నారు అంటే ఇందులో మొదటి మూడు అనిత్యాలు. మోక్షం ఒక్కటే నిత్యమైనది, సత్యమైనది. అందుచేత మోక్షం మీదే నీ మనస్సును నిలబెట్టి దానిని పొందటానికి ప్రయత్నం చేయండి. నీ మనస్సుని నువ్వు నియమించుకో. మనస్సును నియమించుకోవటానికి సజ్జనసాంగత్యం అవసరం. మనకు కావలసింది ఆగ్రహంకాదు, మనకు నిగ్రహం కావాలి. నీ మనస్సును నిగ్రహించుకొంటే అదే నీకు మిత్రుడిగా సహకరిస్తుంది. అమృతానుభవం పొందటం కోసం నీ శరీరాన్ని, మనస్సును మేగ్జిమమ్ ఉపయోగించుకో.

అర్థం అనర్థాలు తెచ్చిపెడుతుంది అంటున్నారు ఆచార్యులవారు. డబ్బు వలన చాలామందికి గర్వం వచ్చేస్తుంది, చెడ్డఅలవాట్లలోనికి వెళ్ళిపోతారు. అవసరాలకు మించి నీకు డబ్బు ఎక్కువ ఉంది అనుకో అది చివరకు అనర్థాలు తెస్తుంది. నీలోపల ఉన్న కల్మషం, చెడుగుణాలు పోవాలంటే ఆచార్యుడి అనుగ్రహం అవసరం. చాలా బలమైన దేవతలు కూడా ఒకోసారి రాక్షసులచేతిలో ఓడిపోయారు. అప్పుడు మహావిష్ణువు అవతారం ఎత్తి వచ్చి దేవతలకు సహాయం చేయవలసివచ్చింది. ఇంక నువ్వు ఎంత? నీ సాధన ఎంత? నువ్వు ఏదో సాధన చేస్తున్నట్లు ఉంటే ఎప్పుడో ఆచార్యుడి అనుగ్రహం వస్తుంది. ఆ అనుగ్రహ ప్రవాహంలో నీలో ఉన్న కల్మషం అంతా కొట్టుకొని పోతుంది కాని నీ అంతట నీవు దానిని తొలగించుకోలేవు ఎందుచేతనంటే అది ఎన్నో జన్మలనుండి నీలో పాతుకొనిపోయి ఉంది. ఇతరులు నీ పట్ల మంచిగా ఉన్నా, చెడ్డగా ఉన్నా, ప్రేమగా ఉన్నా, ద్వేషంగా ఉన్నా నువ్వు అందరినీ ప్రేమించు, అందరి క్షేమం కోరుతూ ఉండు. ఎవరిపట్ల నీకు విరోధం వద్దు. వారు నిన్ను విరోధి అని అనుకోవచ్చు అది నీకు అనవసరం, నువ్వు అందరి పట్ల మిత్రత్వమే కలిగి ఉండు.

కర్మకు తక్కువ విలువ ఇచ్చారు, జ్ఞానానికి ఎక్కువ విలువ ఇచ్చారు అని కొంతమంది ఆచార్యులవారిని విమర్శిస్తారు. ఆయన దేశం అంతా మూడుసార్లు కాలినడకన తిరిగి బోధించాడు, అనేక భాష్యగ్రంథాలు, ప్రకరణ గ్రంథాలు, స్తోత్ర గ్రంథాలు వ్రాసాడు. అది కర్మ యోగం కాకపోతే ఏ యోగం అవుతుంది. ఆయన కర్మయోగానికి ప్రాముఖ్యం ఇవ్వలేదు అనే విమర్శలో అర్థంలేదు. కామ్యకర్మలు చేసేవాడికి చిత్తశుద్ధి ఎలా కలుగుతుంది, మోక్షం ఎలా కలుగుతుంది. మనం చేసే పని ఎలా చేస్తున్నాము అని ఇంటికి వెళ్ళి ప్రశ్నించుకోండి. సర్వసాధారణంగా మనిషి రాగద్వేషాలతో పనిచేస్తాడు. మేము కర్మ చేస్తున్నాము అంటే అది ఎవరికోసం చేస్తున్నావు, దేనికోసం చేస్తున్నావు. నువ్వు అజ్ఞానంతో పనిచేస్తూ జ్ఞానాన్ని ఆశిస్తావా బుద్ధి తక్కువ వాడా అంటున్నారు. నీకు ఇంటినిండా డబ్బు ఉన్నంతమాత్రంచేత, భోగాలు ఉన్నంతమాత్రంచేత నీ మనస్సు నిర్మలం అవుతుంది అని, చల్లబడుతుంది అని అనుకోవద్దు. ఈ మనస్సు దేనివల్ల ప్రకాశింపబడుతోందో దానిగురించి శ్రవణం చేయుటంవలన, దానిని మననం చేయటం వలన నీ మనస్సుకు చల్లదనం వస్తుంది, నీ మనస్సు నిర్మలం అవుతుంది,

నీ మనస్సు పవిత్రమవుతుంది. లోపల ఉన్న పరబ్రహ్మం ఎంత పవిత్రమైనదో, నీ మనస్సు అంత పవిత్రం అయితే అప్పుడు ఈ జీవుడు వెళ్లి ఆత్మలో ఐక్యమవుతాడు.

కర్తృత్వమే నీ దుఃఖానికి, నీ అశాంతికి కారణం. నేను ఇది సాధించాను, నేను అది సాధించాను, నేను ఈ పని చేసాను, నేను ఆ పని చేసాను అని ఏదో ఒకటి అనుకొంటూ ఉంటావు, అక్కడ నుండి సంసారం ప్రారంభమవుతుంది. మనస్సు ఉన్నంతసేపు వాడు ఏదో ఒకటి అనుకోకుండా ఉండలేడు. ఇక్కడ అర్థంచేసుకోవలసింది ఏమిటి అంటే ఆత్మకు కర్తృత్వం లేదు. నువ్వు ఆత్మ అయి ఉన్నావు. మరి నీకు కర్తత్వం ఎందుకు వస్తోంది. నువ్వు దేహాన్ని ఆత్మ అనుకొంటున్నావు, దేహమే సర్వస్వం అనుకొంటున్నావు. అక్కడ నుండి కర్తృత్వం పుడుతోంది. దేహాత్మబుద్ధి వలన కర్తృత్వం పుడుతోంది. నువ్వు ఏదిగా ఉన్నావో అది ఉన్నది ఉన్నట్లుగా నీకు ఎరుకలోనికి వచ్చేవరకు దేహాత్మబుద్ధి నిన్ను విడిచిపెట్టదు. దేహాత్మబుద్ధి ఎంతకాలం అయితే విడిచిపెట్టదో అంతకాలం కర్తృత్వం విడిచిపెట్టదు. కర్తృత్వం విడిచిపెట్టకపోతే సంసారం తప్పదు, దుఃఖం తప్పదు, అశాంతి తప్పదు. నువ్వు కర్తృత్వం ఇప్పడు విడిచిపెట్టి నువ్వు నిలబడేలోపు నీకు దుఃఖం పోతుంది. నువ్వు ఆత్మ అయి ఉన్నావు, దానికి కర్తృత్వం లేదు. మరి ఈ కర్తృత్వబుద్ధి ఎక్కడనుండి వస్తోంది అని విచారణ చెయ్యి. విచారణ చేసి దానిని పోగొట్టుకోవాలి లేకపోతే ఇలా వెయ్యి జన్మలు ఎత్తినా సంసారం నిన్ను విడిచిపెట్టదు. దేహబుద్ధి అంత తొందరగా పోదు దానికి దీర్ఘమైన సాధన ఉండాలి, ఆచార్యుడి దయ ఉండాలి, కాలం కలిసిరావాలి, దానికి తగిన స్నేహం దొరకాలి, ఇన్ని రకాలుగా కలిసివస్తేగాని దేహబుద్ధి నశించదు.

శ్రీకృష్ణచైతన్యుడు చివరి రోజులలో పూరిజగన్నాథంలో ఉండేవాడు. ఒకరోజున శ్రీకృష్ణచైతన్య కృష్ణుడికి అలంకరించటానికి పుష్పాలు కోసుకొంటూ ఉంటే, ఒక అబ్బాయి వచ్చి నేను కూడా మీకు సహాయం చేస్తాను అని పుష్పాలు కోయటం మొదలుపెట్టాడు. బాబూ నువ్వు ఎవరవు అని కృష్ణచైతన్య అడిగాడు. ఆ అబ్బాయి ఏమన్నాడు అంటే మీరు ఎవరు అని నన్ను అడుగుతున్నారు. వేదాంతమాటలు వింటే నువ్వు శరీరం కాదు, నువ్వు ఆత్మవు అని చెపుతున్నారు. వారు అలా చెప్పినా నేను శరీరాన్నే అని అనుకొంటున్నాను. నువ్వు ఇది కాదువయ్యా, నువ్వు అదే అనివారు అంటున్నారు. మరి మీరు నన్ను ఎవరు అని అడుగుతున్నారు నేను శరీరాన్ని అని చెప్పాలా, నేను ఆత్మని అని చెప్పాలా అనేది తెలియటంలేదు అన్నాడు. అప్పడు చైతన్యుడు ఏమన్నాడు అంటే అబ్బాయి నువ్వు అబద్ధం చెప్పటంలేదు. నువ్వు సత్యమే చెప్పావు, సత్యంకూడా ప్రీతిగా చెప్పావు, నా హృదయాన్ని రంజింపచేసేట్లుగా చెప్పావు. నువ్వు చెప్పింది రైటే, వారు చెప్పింది రైటే. వారు ఏమో ఆత్మ అని చెప్పారు అది కరెక్టు. కాని నాకు అది అనుభవంలో లేదు కదా అందుచేత శరీరాన్ని నేను అని నువ్వు అంటున్నావు. ఇప్పడు మనం ఈ పుష్పాలు కోసుకొంటున్నాము. ఈ పుష్పాలచెట్టు ఎప్పడో ఎవరో వేసారు. ఇప్పడు మనం పుష్పాలు కోసుకొంటున్నాము. ఇవాళ చెట్టు వేస్తే ఈ రోజే పుష్పాలు రావుకదా. మొక్కను నాటి శ్రద్ధగా నీరుపోసి దానిని పెంచితే కాని అది పుష్పాలు

పూయదు. అలాగే ఈ దేహమే నేను అనే బుద్ధిని పోగొట్టుకోవటానికి కొంతసాధన అవసరం, భగవంతుడి దయ అవసరం. చెట్టుకు కాయలు, పుష్పాలు కాయటానికి కొంత టైము ఎలా పడుతుందో అలాగే నువ్వు సాధన చేస్తూ ఉంటే దేహబుద్ధి పోయి, ఆత్మబుద్ధి రావటానికి కొంతటైము పడుతుంది. ఆ టైములో నువ్వు సాధన చేస్తూ, మహాత్ముల సహవాసం చేస్తూ, కాలాన్ని సద్వినియోగం చేసుకొంటూ ఉంటే ఆత్మ నువ్వు అనే అనుభవం ఈజన్మలోనే వస్తుంది అని అనుగ్రహించి పంపాడు. దేహబుద్ధి పోయి ఆత్మబుద్ధి సంపాదించటానికి ఎంతో సహనం కావాలి. ఏదో ఒకరోజున గంతులు వేస్తే ఇది వచ్చేయదు. అన్ని పరిస్థితులలోను నువ్వు అణిగి ఉండాలి. గీతలో చెప్పిన మాటలను ప్రమాణంగా తీసుకొని నువ్వు జీవించాలి. ఇలా ప్రయత్నం చేస్తూ ఉంటే కొంతకాలానికి దేహాత్మబుద్ధి పోయి బ్రహ్మాత్మబుద్ధి కలుగుతుంది. నీ ప్రారబ్ధాన్ని బట్టి నీకు ధనం ఉండవచ్చు, చదువు ఉండవచ్చు, అందం ఉండవచ్చు, అన్నీ ఉండవచ్చు. ఇవన్నీ ఉన్నాయని వాటితో తాదాత్మ్యం పొంది గర్వం తెచ్చుకోవద్దు. ఎందుచేతనంటే ఇవన్నీ కాలప్రవాహంలో కొట్టుకొనిపోతాయి. చనిపోయే రోజు వచ్చేటప్పటికి చివరకు గర్వం మిగులుతుంది, అది అనేక నీచజన్మలను తీసుకొని వస్తుంది, ఇదో ప్రమాదం.

ఎవడైతే కల్మషాలన్నింటిని పోగొట్టుకొని హృదయంలో ఉన్న సద్వస్తువును ఉన్నది ఉన్నట్లుగా ఎరుకలోనికి తెచ్చుకొన్నాడో వాడికి శరీరం ఉన్నా లేకపోయినా, లోకం ఉన్నా లేకపోయినా వాడు బ్రహ్మానుభవంలో, బ్రహ్మం తాలుక సుఖంలో ఊగిసలాడుతూ ఉంటాడు. సుఖి అంటే ఈ లోకంలో ఒక్క జ్ఞాని మాత్రమే నిజమైన సుఖి. మీరు లోకాన్ని భయపెట్టకండి, లోకాన్ని చూసి భయపడకండి, ఇతరులను భయపెట్టవద్దు, ఇతరులను చూసి మీరు భయపడవద్దు. ఇది సాధకుడికి ఉండవలసిన లక్షణం. మీకు ఏదైనా శుభవార్త వచ్చింది అనుకోండి ఆ శుభవార్త రాకముందు మీ మనస్సు ఎలా ఉందో శుభవార్త విన్న తరువాత కూడా మీ మనస్సు అలాగే ఉండాలి. మనస్సుకు పొంగు వచ్చింది అంటే మీరు అవుటైపోతారు, అంటే మీ స్వరూపానికి దూరమైపోతారు. మనస్సుకు మేత పెట్టకండి. మీకు ఎప్పుడైనా సంతోషం వస్తే సంతోషించేది ఎవరు మనస్సు, అలాగే దుఃఖపడేది కూడా మీ మనస్సే. సంతోషం ద్వారా, దుఃఖం ద్వారా మనస్సుకు ఫుడ్ వెళ్ళిపోతుంది. అందుచేత మీకు పరిస్థితులు ఎలా ఉన్నా సమానంగా ఉండటం ప్రాక్టీసు చెయ్యండి.

ఇప్పుడు మనకు దేహబుద్ధి ఉంది, బేధబుద్ధి ఉంది. బేధబుద్ధి ఉన్నప్పుడు నువ్వు వేరు, నేను వేరు అనుకొంటావు. అప్పుడు నిన్ను చూస్తే నాకు భయం వేస్తుంది. నన్ను చూస్తే నీకు భయం వేస్తుంది. రెండు ఉన్నచోట భయం, అసూయ, కామం, కోపం అన్నీ వస్తాయి. ముందు రెండుపోయి ఒకటిలోనికి రావాలి అంటే దేహగతమైన నేను వెళ్ళి నిజమైన నేనులో ఐక్యమవ్వాలి. అప్పుడు అంతా ఒక్కటే అనే అనుభవం కలుగుతుంది. ఉన్నది ఒక్కటే అయినప్పుడు ఇంక ఎవరిని చూసి భయపడతావు, ఎవరిని చూసి అసూయపడతావు. భయపడటానికి, అసూయ పడటానికి మనకంటే వేరుగా ఎవరైనా ఉంటేకదా. మనలో క్షమాగుణం తక్కువగా ఉంటుంది,

సహనం తక్కువగా ఉంటుంది. మనం ఇంత వేదాంతం వింటున్నాము, చిన్నమాట అంటే పడలేము. ఎందుచేతనంటే మనకు లోతు లేదు, విశాలం లేదు. లోపలకు దిగుదాము అంటే అరికాళ్ళు తడవవు. పోనీ విశాలంగా ఉందా కొంచెం స్నానం చేద్దాము అంటే విశాలం లేదు. స్నానం చేయటానికి పనికిరాము, అరికాళ్ళు కడుక్కోవటానికి పనికిరాము. మన దగ్గర రెండూ లేవు. మనకు అల్పమనస్సు పనికిరాదు. కొంతమంది ఏంచేస్తారు అంటే మీరు ఏదైనా మాట అన్నారు అనుకోండి గబుక్కున ఆ మాట ఎప్పుడు అప్పచెప్పేద్దాము అని చూస్తారు, దానిని ప్రతీకారబుద్ధి అంటారు. ప్రతీకారబుద్ధి వలన రియాక్షన్ పెరిగిపోతూ ఉంటుంది. మిమ్మల్ని ఎవరైనా ఏదైనా మాట అన్నారు అనుకోండి మరిచిపోతే ఏమీలేదు. అదే రాపాడించుకొంటే రజోగుణం పుడుతుంది.

ఉపాసన లేకపోతే ఇంద్రియనిగ్రహం రాదు, మనస్సుకు ఏకాగ్రత రాదు. అందువలన ఉపాసన అవసరమే, ఆరాధన అవసరమే. జపం, ధ్యానం అందుకే మన పెద్దలు ఏర్పాటుచేసారు. ఏదైనా అవతారపురుషుడి నామం తీసుకొని జపం చేస్తున్నారు అనుకోండి, ఆయన రూపాన్ని ధ్యానం చేస్తున్నారు అనుకోండి మనస్సు యొక్క చాపల్యం ఆగిపోతుంది, మనోనిగ్రహం వస్తుంది. రూపంకంటే గుణం గొప్పది, గుణం కంటే జ్ఞానం గొప్పది. జ్ఞానాన్ని బోధించటం అంటే జ్ఞానాన్ని మీకు ఇవ్వాలి అది ముఖ్యం. అది ఎలా ఇస్తున్నారు అంటే దక్షిణామూర్తి మౌనంగా ఇచ్చారు. ఆచార్యులవారు దాని గురించి బోధించి, బోధించి మీచేత ఎక్కువగా శ్రవణం చేయించి, మననం చేయించి జ్ఞానాన్ని మీచేత పొందింపచేసారు. ఆయన బోధస్వరూపుడు. రమణ మహర్షిగారు ఎలా చేసారు అంటే ఆయన దక్షిణామూర్తిలాగ పూర్తిగా మౌనంగా లేరు, ఆచార్యులవారిలాగ ఉదయం మొదలు సాయంత్రం వరకు అదే పనిగా టీచింగ్ లేదు. అవసరాన్ని బట్టి మాట్లాడేవారు.

నువ్వు కర్మ చేస్తావు. కర్మ చేస్తే ఫలితం వస్తుంది, ఆ ఫలాన్ని భోగించటం వలన అక్కడ వాసన పుడుతుంది. నీకు సుఖం కావాలి. సుఖం కోసం భోగాలమీద ఆధారపడతావా? నీ శరీరం భోగాలు అనుభవించటానికి తప్పించి ఎందుకూ పనికిరాదా? భోగం అనుభవించటం వలన రోగం వస్తుంది కాని సుఖం రాదు. ఏ వాసన అయితే మీరు తొలగించుకోవాలి అనుకొంటున్నారో అది మీకు ఎందుకు వచ్చింది, ఇతరులకు ఎందుకు రాలేదు. వాసనలు అందరికీ ఎందుకు సమానంగా లేవు. ఇప్పుడు ఈ శరీరాలు ఎలా ఉన్నాయో, అలాగ పూర్వం అనేక శరీరాలు గడిచిపోయినాయి. ఆ శరీరాలలో మనం చేసిన కర్మనుబట్టి మనకు వాసన పడుతుంది. ఎవరు చేసిన కర్మలను బట్టి, వారు కర్మఫలితాన్ని భోగించటాన్నిబట్టి వాసనలు పడతాయి అందుచేత వాసనలు అందరిలోను సమానంగా ఉండవు. దేనివల్ల సుఖం రాదో దానివలన సుఖం వస్తుందని అనుకొని అప్పుడు దానిని ప్రేమించాము. శాస్త్రాన్ని అధ్యయనం చేయటం వలన, ఆచార్యులు బోధించటం వలన నీ మనస్సు ఎక్కడైతే వాలుతుందో అక్కడ సుఖం లేదు అని మనకు అర్థమయ్యి ఆ మనస్సును వెనుకకు తీసుకొనిరావటానికి ప్రయత్నం

చేస్తున్నాము. మనస్సును వెనుకకు తీసుకొనిరావటానికి వాసన అంగీకరించటంలేదు. నా ఇష్టాలను నేను ఎలా విడిచిపెడతాను అని మనస్సు అంటుంది. ఎవడో ఆచార్యుడు చెప్పాడని నన్ను విడిచిపెట్టేస్తావా నీ సంగతి చూస్తాను అంటుంది. అప్పడు ఆచార్యుల మాటలను జ్ఞాపకం తెచ్చుకొని నీ సంగతి ఏమిటో నేను చూస్తాను అని మనం అంటాము. ఇలా కౌరవ పాండవ యుద్ధం రోజూ మన హృదయంలో జరుగుతుంది. కృష్ణుడి సహాయం లేకుండా పాండవులు కౌరవులను జయించలేకపోయారు. అలాగే భగవంతుడి సహాయం లేకుండా మనం ఈ వాసలను జయించలేము. మీరు సాధన చేసినా ఈశ్వరానుగ్రహం లేకపోతే ఈ వాసనల నుండి విడుదల పొందలేరు.

జ్ఞానం బోధించేటప్పడే ఆచార్యుడు ఏమి చేస్తాడు అంటే జ్ఞానం నీకు అందటానికి, నీ గుండెకు పట్టటానికి లోపల ఏ వాసనలు అయితే అడ్డు వస్తున్నాయో వాడికి తెలుస్తుంది. వాటిని క్లియర్ చేసుకొంటూ వెళతాడు. ఆచార్యుడు బోధించటమేకాదు తను ఏ వస్తువు గురించి చెపుతున్నాడో ఆ వస్తువు తాలుక అనుభవం నీకు వచ్చేవరకు నిన్ను వెంటాడతాడు, వాడు ఆచార్యుడు. ఆచార్యులవారు శరీరం విడిచిపెట్టేముందు ఆయన దగ్గర ఉన్న నలుగురు శిష్యులను కూర్చోబెట్టుకొని ఇంతకాలం మీరు పెట్టిన అన్నానికి, మీరు ఇచ్చిన బట్టలకు సంతోషం, నేను మీకు కృతజ్ఞుడిని అని ఆచార్యులవారు అన్నారు. ఆ మాటలకు అక్కడ ఉన్న ఒక శిష్యుడు బోరున విలపించాడు. మేము మట్టిముద్దలం, మమ్మల్ని మహాపండితులుగా మార్చి, పాండిత్యం ఇవ్వటమే కాకుండా జ్ఞానంతోటి అనుగ్రహించారు. జ్ఞానం అనే దుప్పటిని మా మీద కప్పారు. ఈ మట్టిముద్దలను తీసుకొనివెళ్ళి బంగారం చేసారు. మేము పెట్టిన అన్నానికి, బట్టలకు మీరు కృతజ్ఞత చెపుతూ ఉంటే మీరు మాకు ప్రసాదించిన ఆత్మజ్ఞానానికి మేము ఏమి చెప్పాలి అని పద్మపాదుడు బోరున ఏడ్చాడు. అంటే సత్పురుషులకు పెద్ద ఉపకారం అక్కరలేదు మనం చిన్న ఉపకారం చేసినా జీవితం పొడుగునా మన పట్ల కృతజ్ఞత కలిగి ఉంటారు. దుర్జనుడికి ఎంత ఉపకారం చేసినా వెంటనే మరిచిపోతాడు. కృతజ్ఞత ఎలా ఉంటుందో తెలియని మనుషులు చనిపోతే వారి శవాలను నక్కలు కూడా తినటానికి ఇష్టపడవు అని వాల్మీకి చెప్పాడు. మేము అనేక జన్మలు నుండి మోసుకొనివస్తున్న దుఃఖాన్ని, ప్రస్తుతం ఉన్న దుఃఖాన్ని మొత్తం ఊదేసి దుఃఖం లేని స్థితికి మమ్మల్ని తీసుకొని వచ్చావు. అదంతా వదిలేసి మేము ఇచ్చిన బట్టల గొడవ ఎత్తుతారు ఏమిటి? ఇవాళ ఇచ్చిన బట్టలు రేపు చిరిగిపోతాయి కాని మీరు ఇచ్చిన జ్ఞానానికి అంతం లేదు, అది శాశ్వతమైనది. శరీరం అగ్నికి ఆహుతి అవ్వకముందే మరణభీతిని పోగొట్టి మరణంలేని స్థితికి మోసుకొనిపోయారు. మేము అన్నం పెట్టాము అంటున్నారు, మీరు మాకు పెట్టిన జ్ఞానభిక్ష మాట ఏమిటి అన్నాడు పద్మపాదుడు. అలౌకికమైన, అభౌతికమైన ఒక ముగింపు లేనిశాంతి ఆచార్యులవారి హృదయంలో ఉంది. ఆచార్యులవారికి భార్యలేదు అనుకోవద్దు, ఆయన హృదయంలో ఉన్న శాంతే ఆయన ధర్మపత్ని. మాకు ఆస్తులు ఉన్నాయి ఆచార్యులవారికి ఏమీ ఆస్తిలేదు అనుకోకండి. ఆయనలో ఉన్న ఆత్మజ్ఞానమే, ఆత్మవైభవమే ఆయన ప్రాపర్టీ.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| జూన్ | 9 | జిన్నూరు శ్రీ రమణ క్షేత్రం |
| జూన్ | 17 | హైదరాబాద్, జెఎన్‌టియు రోడ్, మలేషియా టౌన్ షిప్ ఎదురుగా, కెపిహెచ్‌బి కాలనీలోని గోవర్ధనగిరి నందు ఉ॥ 8-14 ని॥లకు సద్గురు శ్రీ నాన్నగారిచే "వేణుగోపాలస్వామి విగ్రహ ప్రతిష్ఠ" |

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

- Mahabharatha

# ఉపనిషత్తుల జ్ఞానాన్ని గురువు ద్వారానే పొందాలి

ఉపనిషత్తులలో ఉన్న వైరుధ్యం శిష్యునికి బోధపడదు. ఒకచోట బ్రహ్మమొక్కటే... రెండవది లేనేలేదు అంటారు. అంతా బ్రహ్మమేనంటారు. లోకమంతా మిధ్య అని బ్రహ్మమే సత్యమంటారు. అన్ని వైవిధ్యాలవెనక ఉన్నది ఒక్కటే పరిపూర్ణ సత్యం అంటారు. ఉపనిషత్తులను ఎందరో పండితులు పలువిధాలుగా వ్యాఖ్యానించారు. అవన్ని చదివినా కూడా సాధకులకు, శిష్యులకు సందేహాలు తీరవు. ఎందుచేతనంటే గూఢమైన సత్యాలను పరమగురువులు మాత్రమే వెల్లడించగలరు.

గురువులను పరీక్షించాలనీ, వారికెంతమాత్రం తెల్సునో తెలుసుకుందామని అవినయంగా సాధకులుగాని, శిష్యులుగాని వారి సందేహాలను వెలిబుచ్చితే వాటికి సమాధానాలు రావు, దొరకవు. అలా కాకుండా తెల్సుకోవాలని, నేర్చుకోవాలని జిజ్ఞాసతో గురువులను వినయంగా అడిగితే, ఒక క్రమపద్ధతిలో వాటికి జవాబులు చెపుతూ, శిష్యుడి సందేహాలన్నింటిని పటాపంచలు చేస్తూ గురువుగారంటారు "నాయనా! ఉపనిషత్తులలో వైరుధ్యాలు ఉన్నట్లుగా అజ్ఞానికి అనిపిస్తుంది. అందులో వైరుధ్యాలంటూ ఏమీలేవు. అవి మహర్షుల తీవ్రమైన చింతనలో, ధ్యానంలో పొందిన ప్రత్యక్షజ్ఞానఫలాలు".

అభ్యాసం మొదలుపెట్టేటప్పుడు శిష్యుడు కనిపించే ఈ లోకం మార్పేందుకు వీలున్నదని, సత్యం మాత్రం ఎన్నటికి మారదని తెల్సుకుంటాడు. తర్వాత తర్వాత... మార్పులతో నిండి, నామరూపాలతో ఉన్న ఈ ప్రపంచం మిధ్య అని గ్రహిస్తాడు. సాధన పెరిగిన తర్వాత రెండవదశలో సత్యం కొంతవరకు బోధపడుతుంది. మిధ్య అనేది నిజానికి లేదని, సత్యం ఏకమని, అదే సర్వవ్యాప్తమని అర్థమవుతుంది. సాధన ఇనుమడించిన దశలో ఉన్నది సత్యం మాత్రమేనని, రెండవది లేనే లేదని మిధ్యగా అనిపించినది, కనిపించేది సత్యం యొక్క లీలయేనని గ్రహిస్తాడు.

ఉపనిషత్తులను సమర్థులయిన, ఆత్మానుభవం పొందిన గురువుల వద్దనే నేర్వాలి. లేకుంటే అన్నీ వైరుధ్యాలే అగుపిస్తాయి. ఉపనిషత్ బోధలను సామాన్యుడుగాని, పండితులుగాని తెల్సుకోలేరు. అంతర్వాణి ద్వారా వచ్చే జ్ఞానం వల్లనే వాటిని ఎవరైనా అర్థం చేసుకునేందుకు వీలవుతుంది. అట్టి జ్ఞానం కేవలం గురువు అనుగ్రహం వల్లనే సాధ్యపడుతుంది.

**- బొప్పన అరుణాదేవి, హైదరాబాద్**

# శుద్ధిలేని మాటల వల్లనే - తలరాతలు వస్తాయి

మనం అవసరం ఉన్నంత వరకే మాట్లాడాలి అది కూడా మౌనమే. సత్యభాషణ వల్లనే మాట పవిత్రమౌతుంది. మాట్లాడిన తరువాత పశ్చాత్తాప పడకూడదు. ద్రౌపతి మయసభలో దుర్యోధనుని చేష్టలుచూచి నవ్వినమూలంగా పాండవులను సర్వనాశనం చెయ్యాలనే కక్షకు దారితీసింది. అతిగా మాట్లాడటం వల్ల శారీరకంగా, మానసికంగా చాలా నష్టపోతాము. మాట నమ్రతగా ఉండాలి ఏ పరిస్థితిలోనూ మాట తూలనాడకూడదు. కోపం తెచ్చుకోకూడదు. ప్రపంచాన్ని నడిపేది మనంకాదు. ఈశ్వరునికే అది వదిలేయాలి. ఎంత సరదా పుట్టించినా పోచిపోలు కబుర్లు మాట్లాడకూడదు. వీధి కూడళ్లలో పనికిమాలిన వివాదాల్లోకి దిగకూడదు. జగడాల గురించి, భీభత్సాలగురించి, కట్టుకధలగురించి, బుద్ధిజ్ఞానంలేని మాటలు మాట్లాడకూడదు. మంచివైపు, జ్ఞానంవైపుకు మన సంభాషణలు మార్చాలి అలా చెయ్యలేకపోతే అక్కడ నుంచి వెళ్లిపోవాలి అంతే. సాధకులు బంగారాన్ని దాచుకొన్నట్లుగా మౌనాన్ని అలవర్చుకోవాలి. మనం మాట్లాడటానికి ముందు మన మాట చేస్తుందోలేదో చూచుకోవాలి లేదా నోరెత్తగాదు. మన మాట మనకన్న ఎదుటివాళ్లకన్న ఉపయోగపడాలి. తియ్యని మాటమందు - కఠినమైన మాట బాణం, అది శరీరాన్ని మనస్సును పాడుచేస్తుంది. పరుషవాక్యాలు, అవమానం కలిగించే మాటలు, గాలి వార్తలు విరమించుకోవాలి. ఒక సత్యమైన సంఘటన ఒకరు "ఓరే నారాయుడు గంట కొట్టేటట్లు ఉన్నావు" ప్రత్యర్థి " ఈరోజు నేను చనిపోతే రేపు నీవంతు వస్తుంది" తదాస్తు దేవతలు "అలాగే" అన్నారు అక్షరాలా అలాగే జరిగింది. నవ్వుతూ చేసే తప్పడు మాటలు ఏడుస్తూ అనుభవించాలి. వాక్‌శుద్ధి ఎలా పనిచేస్తుందో భోజరాజుకు అనుభవమైనది. ఆయన కాళిదాసుతో అసందర్భంగా "నేను మరణిస్తే నా రాజ్యం ఏమౌతుంది" సమాధానం చెప్పకపోవటంతో దేశభహిష్కరణ చేయించాడు. కొంతకాలానికి గూఢచారులతో "భోజరాజు మరణించాడు" అని అసత్య ప్రచారం అందించగా కాళిదాసు "రాజ్యం భ్రష్టమైనది" అనగా రాజు మరణించాడు విషయం గ్రహించిన కాళిదాసు తిరిగి స్తుతించగా రాజు జీవించాడు. శ్రీనాన్నగారు "ప్రేమతో మాట్లాడు, ఆలోచించి అర్థం చేసుకొని మాట్లాడు, మంచిమాట మాట్లాడు, తెలివిగా మాట్లాడు, తక్కువగా నవ్వుతూ మాట్లాడు, పూర్తిగా విన్న తరువాత మనస్సు విప్పి మాట్లాడు, ఉన్నది ఉన్నట్లు నొప్పించకుండా మాట్లాడు. మనం ఎదుటి వారి మానసిక ప్రవృత్తినిబట్టి నడుచుకోవటం మంచిది. అలా ఉంటే గలాటాలు ఉండవు. అయితే వాది మనస్తత్వం వల్ల మనం పాడైపోకూడదు. మన స్వతంత్ర్యం మనం పోగొట్టుకోకూడదు. బాహ్యంగా వారికి అనుకూలంగా ప్రవర్తిస్తున్నప్పటికి మన జాగ్రత్తలో మనం ఉండాలి" అన్నారు. ఏఏ జన్మలలో చేసిన చెడుమాటలను మూటకట్టుకొని ఈ జన్మ ఎత్తాము వాటిని ఇప్పడు అనుభవిస్తున్నాము ఆ మూటల బాకీ తీరిపోతే శివసన్నిధికి చేరిపోతాము.

- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్థవరం